క్లుప్తంగా

చిన్నారికి జాతీయ కళారత్న అవార్డు


చిన్నారికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్ : మండలంలోని సూర్యనగర్ ప్రాంతానికి చెందిన చిన్నారి గండికోట భువన చంద్రికకు జాతీయ కళారత్న అవార్డు లభించింది. హనుమకొండలో జరుగుతున్న జాతీయ నృత్య కళా ప్రదర్శన పోటీల్లో క్లాసికల్ నృత్యంలో భువనచంద్రిక అద్భుత ప్రతిభ కనబర్చింది. చిన్నారి ప్రస్తుతం ఖమ్మంలోని మీనా నృత్యాలయ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతోంది. భువనకు అవార్డు రావడంతో పలువురు అభినందించారు.

ఖమ్మం 'ఆత్మ' కమిటీ చైర్మన్‌గా దిరిశాల



రఘునాథపాలెం: ఖమ్మం నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్‌గా మండలంలోని బూడిదంపాడుకు చెందిన దిరిశాల చిన్న వెంకటేశ్వరరావు నియామకమయ్యారు. ఈ మేరకు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లుతో పాటు 30 మందితో కూడిన కమిటీని నియమించారు. ఇటీవల ప్రతిపాదిత కమిటీతో వ్యవసాయశాఖ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు రఘునాథపాలెం రైతువేదికలో సమావేశం ఏర్పాటు చేసి కమిటీ నియామకంపై ఖమ్మం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆత్మకు అనుమతి కోసం ప్రతిపాదనలు పంపారు. ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కామేపల్లి మండలాల పరిధి కలిపి ఉన్న నియోజకవర్గ ఆత్మకమిటీలో కామేపల్లి నుండి ఇద్దరు, ఖమ్మం అర్బన్ నుంచి ఏడుగురు, రఘునాథపాలెం మండలం నుండి 21 మంది సభ్యులుగా ఉన్నారు.

పౌర్ణమి వేడుకలు


బౌద్ధ క్షేత్రం వద్ద బౌద్ధ భిక్షువులు రిక్కత బంతేజి, తదితరులు

నేలకొండపల్లి: నేలకొండపల్లి బౌద్ధస్తూపం వద్ద సోమవారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ భిక్షువులు సద్ద రిక్కత బంతేజి విచ్చేసి బుద్ధ ప్రవచనములు, బుద్ధవందనం నిర్వహించారు. నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి పరిచాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఉపాసకులు పెదపాక వెంకట్, పైడికత్తుల ఈదయ్య, రవి, కె. వెంకటేశ్వరరావు, పి. వెంకట్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

నేలకొండపల్లి: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రయాణిస్తున్న కారు టైర్లు పేలి తృటిలో ప్రమాదం నుండి తప్పించుకున్నందుకుగా మండలంలోని ముఠాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గుదిమళ్ల మధు ముఠాపురం వీరన్నస్వామి ఆలయంలో సోమవారం 101 కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం..
వినోద	గేమ్ చేంజర్, సంక్రాంతికి వస్తున్నాం
సాయిరాం	డాకు మహారాజ్
ఆదిత్య	గేమ్ చేంజర్
శ్రీనివాస	డాకు మహారాజ్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	48		20
బెండకాయ	48	పాలకూర	3
పచ్చిమిర్చి	44		20
కాకర	54	చుక్కకూర	3
బీర	48		20
దొండ	54	తోటకూర	3
పొట్లకాయ	34		20
చిక్కుడు	80	గోంగూర	4
గోరుచిక్కుడు	48		20
క్యాబేజీ	24	మెంతికూర	2
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	48		40
క్యారెట్	54	పుదీన	1
బీట్‌రూట్	48		25
క్యాప్సికం	58	-ఖమ్మం వ్యవసాయం	

భోగి సందడి

- ఆనందోత్సాహాల నడుమ సంబురాలు
- రంగవల్లులతో మగువల ఉత్సాహం
- నేడు సంక్రాంతి వేడుక

ఖమ్మంగాంధీచౌక్: సంక్రాంతి పండుగ సందడి చేస్తోంది భోగ భాగ్యాల భోగి పండుగను సోమవారం ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. తెల్లవారుఝామునే ఇళ్ల ముందు భోగి మంటలతో పండగను కోలాహలంగా ప్రారంభించారు. పాతకు స్వస్తి పలుకుతూ నూతనత్వానికి స్వాగతం పలుకుతూ పాత వస్తువులను, పనికి రాని బట్టలను మంటల్లో వేసి కాల్చేశారు. ఆశీర్వదించారు.

కళ తెచ్చిన రంగవల్లులు

మగువలు పండుగ ఉట్టిపడే విధంగా ఇళ్ల వాకిళ్లలో వివిధ వర్ణాలతో ముగ్గులు వేశారు. గ్రామాల్లో, పట్టణాల్లో వివిధ వర్గాల వారు నిర్వహించిన ముగ్గలు పోటీల్లో మగువలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నూతనంగా పెళ్లిలైన ఇళ్లలో కొత్త అల్లుళ్ల సందడి నెలకొంది. అనంతరం చిన్నపిల్లలపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.


కామేపల్లి: భోగిపండ్లు పోసిన తల్లిదండ్రులు

నేడు సంక్రాంతి

సూర్యుడు మకర రాశిలోకి సంక్రమించిన రోజు మకర సంక్రాంతిని జరుపుకుంటారు. ప్రజలు సంక్రాంతి పండుగను నేడు ఉత్సాహంగా జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. పిండి వంటలు, బంధు మిత్రులతో ఇళ్లు కళకళలాడుతున్నాయి. సంబురాలు ప్రతీ ఇంటా ఆనందంగా జరుపుకుంటున్నారు.


తిరుమలాయపాలెం: సుబ్లేడులో భోగి మంట కార్యక్రమం



ఖమ్మం గాంధీచౌక్: ముగ్గులు వేస్తున్న యువతులు, భోగి మంట వద్ద నగర వాసులు

కోడి పందేలకు తరలిన యువత

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కోడి పందేల్లో పాల్గొనేందుకు, చూసేందుకు భారీగా తరలివెళ్లారు. కొందరు పందెం కాసేందుకు, పందెంలో పాల్గొనేందుకు ప్రత్యేక ఏర్పాట్లతో వెళ్లారు. ఖమ్మం నగరం నుంచి పలు బృందాలు పందెం కోళ్లతో పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లాయి.

ముగ్గుల పోటీలు..

ఖమ్మం మామిళ్లగూడెం: మంకరసంక్రాతి పండుగను పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం 37వ డివిజన్ జీవీమాల్ పక్కన ముగ్గులపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాదశర్మ నాయకులు సూర విష్ణు, గుర్రాల నాగేందర్, పసుమర్తి సంతోష్, పసుమర్తి నర్మద, న్యాయనిర్ణేతలుగా కొలిపాక విజయలక్ష్మి, ఇంగువ భార్గవి, నాగలక్ష్మి, శారద పాల్గొన్నారు. అదేవిధంగా ఐద్వా వన్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో 23వ డివిజన్ చర్చి కాంపౌండ్ ఏరియాలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ బహుమతులు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా స్రవంతి, శ్రీదేవి, పద్మ, రమ వ్యవహరించారు. నాయకులు జబ్బార్, మెహరున్నిసాబేగం, అజిత, మీరా సాహిబ్, సుధాకర్, దినేష్, ఫరీదా, నాగేశ్వరరావు, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: నవజీవన్ సాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మంచుకొండలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. లాల్‌సింగ్, నిర్వాహకులు పాల్గొన్నారు.


ఖమ్మం మయూరిసెంటర్: ట్యాంక్‌బండ్ వద్ద కేఎంసీ ఆధ్వర్యాన నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


ఖమ్మం మామిళ్లగూడెం: ముగ్గులు వేస్తున్న మహిళలు

పండగ పూటా పస్తులే..

- కేఎంసీ కార్మికులకు అందని వేతనాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు పండగపూట పస్తులుంటున్నారు. నగరంలో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులకు అధికారులు వేతనాలు చెల్లించడంలో తాత్సారం చేశారు. దీంతో ఈ నెల 1 నాటికే వేతనాలు అందాల్సి ఉన్నా సంక్రాంతి పండుగ వచ్చినా ఇప్పటి వరకు వేతనాలు వారి ఖాతాల్లో జమ కాలేదు. దీంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, పండగ సమయాల్లోనైనా వేతనాలు సకాలంలో చెల్లిస్తే తమ ఇళ్లల్లో పండుగ జరుపుకుంటామ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా బయోమెట్రిక్ హాజరు మిషన్లు పని చేయకపోవడం, కార్మికుల హాజరు పరిశీలన పేరుతో వేతనాలు జమ చేయడంలో జాప్యం జరుగుతుందని కేఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. కార్యాలయాల్లో కూర్చునే అధికారులు, ఉద్యోగులకు ప్రభుత్వం వేతనం చెల్లిస్తుండగా ఆరోగ్యాలను పనంగా పెట్టి రోడ్లపై వ్యర్థాలు ఎత్తే 800 మంది కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

పథకాల అమలుపై నేడు సమావేశం

తిరుమలాయపాలెం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసేందుకు మంగళవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని రైతువేదికలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ పీవీ రామకృష్ణ ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, రెవెన్యూ అధికారులు, ఐకేపీ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హాజరుకావాలన్నారు.

ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా..

ఖమ్మంఅర్బన్: కాంగ్రెస్ నాయకుడు మలీదు జగన్ లేని లోటు తీరనిదని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఐదు రోజులుగా బల్లేపల్లి మూడవ డివిజన్‌లో మలీదు జగన్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం మంత్రి తుమ్మల ఈ పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో జగన్ కుమారుడు మనీష్, నాగమణి, జగన్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పీవైఎల్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కె.భిక్షం జ్ఞాపకార్థం పీవైఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి స్నేహభావానికి ప్రతీకలన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవడంతో పాటు సమాజానికి ఉపయోగపడాలన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. నాయకులు రమేష్, ఎం. ఉప్పలయ్య, సత్యనారాయణ, సుదర్శన్, రవి, కృష్ణయ్య ఉన్నారు.

నూతన మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి


బిల్లు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రైతు ఉద్యమంతో కార్పొరేట్ వ్యవసాయ చట్టాలను కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకున్నప్పటికీ ఇప్పుడు రూపం మార్చి నూతన జాతీయ మార్కెట్ విధానంగా తీసుకొస్తోందని ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు విమర్శించారు. ఈ మేరకు ముసాయిదా ప్రతులను ఖమ్మంలో సోమవారం దహనం చేశారు. అనంతరం నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతుల సమస్యలను విస్మరించిన కేంద్రప్రభుత్వం నల్లచట్టాలను తీసుకురావడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, మారుతి మల్లయ్య, తిమ్మిరి హనుమంతరావు, వీర్ల వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం


ఖమ్మంఅర్బన్: యూపీహెచ్‌కాలనీలో..

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని రంగనాయకుల గుట్టపై కొలువై ఉన్న స్వయంభు కరిగిరి శ్రీ లక్ష్మీరంగనాథ స్వామి దేవాలయంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా సోమవారం గోదా శ్రీ రంగనాథ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక అర్చకులు బూరడగ్గ వెంకట కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో బూరుడగ్గ శ్రీధరాచార్యులు, చక్రధరా చార్యులు, ఆచార్య సందీప్‌ల వేదమంత్రాల నడుమ కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఖమ్మంఅర్బన్: నగరంలోని యూపీహెచ్‌కాలనీలోని స్వయంభు శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోదాదేవి శ్రీ రంగనాథ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు నరికి నాథుని రామాచార్యులు సిద్ధు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, ప్రధాన కార్యదర్శి పురం తిరుపతయ్య, కోశాధికారి మల్సూర్ నాయక్, పల్లెబోయిన చంద్రయ్య, దండా జ్యోతి రెడ్డి, అల్లిక అంజయ్య, మేకల వీరన్న, కొండలరావు, మణికంఠ, వీరబాబు, సత్యం, వెంకటేశ్వర్లు, రమేష్ ఉన్నారు.


ఖమ్మంగాంధీచౌక్: కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


ఖమ్మంరూరల్: కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

అదేవిధంగా నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లిలోని శ్రీ వెంకటేశ్వర గోశాలలో గోదాదేవి కల్యాణం మహోత్సవ వేడుకలను గోశాల నిర్వాహకులు ఆరుట్ల శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఖమ్మంరూరల్: మండలంలోని సత్యనారాయణపురంలోని సాయిగణేష్‌నగర్‌లో గల స్వయంభు కల్యాణం వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదా రంగనాథ శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాస తిరుకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. తోట సంజీవరెడ్డి, పెద వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నేలకొండపల్లి: మండ్రాజుపల్లిలో..

నేలకొండపల్లి: మండలంలోని మండ్రాజుపల్లి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ సభ్యులు బొర్రా కృష్ణారావు, తుమ్మ ఉపేందర్, నెల్లూరి రంగనాయకమ్మ, గుండు వెంకన్న, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంబురాలు..

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంకు చెందిన యరగర్ల హనుమంతురావును ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించడంపై సోమవారం వీవీపాలెం గ్రామంలో సంబురాలు నిర్వహించారు. ఈ మేరకు యూత్ సభ్యులు హనుమంతురావతో కేక్ కట్ చేయించి సంబురాలు చేశారు.

కనీస వేతనాలు అమలు చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 19న మహబూబాబాద్‌లో జరిగే మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధులను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాలు కాపాడుతున్న కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు లేక కాంట్రాక్టర్ల దయా దక్షిణాలపై ఆధారపడి జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీయూసీఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు ములకలపల్లి లక్ష్మినారాయణ, కె.శ్రీనివాస్, యూనియన్ అధ్యక్షులు దున్న గురవయ్య, యుగంధర్, ధర్మయ్య, బాబురావు, వీరబాబు, శ్రీను, సరస్వతి, రమ, సుభద్ర, పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అడ్‌హక్ కమిటీ నియామకం

రఘునాథపాలెం: కాంగ్రెస్ మండల అడ్‌హక్ కమిటీని తొమ్మిది మందితో నియమిస్తూ సోమవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ వివరాలు ప్రకటనలో వెల్లడించారు. కమిటీ సభ్యులుగా వాంకుడోత్ దీప్లా నాయక్, భూక్యా బాలాజీ, చెరుకూరి పూర్ణచందర్‌రావు, కుతుంబాక సీతారాం, రెంటాల ప్రసాద్, ధరావత్ రాంమూర్తి, కేలోత్ దేవ్‌సింగ్, వెంకన్న ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యతతో పోరాడాలి

- వివిధ సంఘాల నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరణ

ఖమ్మంఅర్బన్: యాదవుల సమస్యల పరిష్కారానికి గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిన జిల్లా అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో మళ్లీ ఐక్యతతో మన హక్కులను సాధించుకోడానికి రాజకీయాలకతీతంగా పోరాట కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అఖిల భారత జిల్లా యాదవ మహాసభ గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో జిల్లాఅఖిలభారత యాదవ మహాసభ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం చట్టసభలలో గాని, నామినేటెడ్ పదవుల్లో ఎక్కడా యాదవులకు ప్రాధాన్యం ఇవ్వలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్‌కు మద్దతు తెలిపితే, కానీ ప్రభుత్వం అవసరానికి వాడుకుని విడిచిపెట్టినట్టు ఉందని విమర్శించారు. రాష్ట్రంలోని యాదవుల సమస్యల పరిష్కారానికి మళ్లీ ఖమ్మం జిల్లా నుండి ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లిక అంజయ్య, చంద్రకాని గట్టయ్య, మేకల నాగేశ్వరరావు, పొదిలి భూపతి, పొదిలి తిరుపతిరావు, కాసు మల్లేష్, జాల నరసింహారావు, ఉపేందర్, పద్మ, బమ్మిడి శ్రీనివాస్, సత్తి వెంకన్న, బండారి ప్రభాకర్, దుబాకుల వెంకటేశ్వర్లు, చేతుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంఅర్బన్: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టాలు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంపై మాత్రమే ఆధారపడ్డ వ్యవసాయ కూలీలకు వారి ఆర్థిక అభివృద్ధికి సమగ్రమైన చట్టాలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం సుందరయ్య భవనంలో 2025 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..న. ఉపాధి హామీ పథకాన్ని సమగ్రవంతంగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, నాయకులు పొన్నగంటి సంగయ్య, తాళ్లపల్లి కృష్ణ, వత్సవాయి జానకి రాములు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోడబట్ల సుదర్శన్, గాలి అంజయ్య, వెంకన్న బాబు, పాపారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం సహకారనగర్: క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురామరెడ్డి తదితరులు

టీపీటీయూ క్యాలెండర్లు..

ఖమ్మం సహకారనగర్: టీపీటీయూ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామరెడ్డిలు ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు మట్టపల్లి రాధాకృష్ణ పలు సమస్యలను విన్నవించగా సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీనిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ పాఠశాల 2009–2010 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో స్థిరపడిన వారంతా ఒకే చోటకు చేరుకుని ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు, రవి, వీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.